




● చిలకలూరిపేటలో అమెరికన్ డైమండ్స్‌తో గణనాథుని విగ్రహం.

# గణపతి బప్పా మోరియా

- జిల్లా వ్యాప్తంగా చవితి ఉత్సవ శోభ
- పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథులు
- పల్లె, పట్టణాల్లో చవితి పండుగ కోలాహలం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చవితి వేడుకలకు మండపాలు ముస్తాబయ్యాయి. బుధవారం వినాయక చవితి పర్వదినంతో జిల్లా అంతటా ఉత్సవశోభ నెలకొంది. పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా గణపతి ఉత్సవాలకు భక్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. రెండు దశాబ్దాలుగా బాపట్లలోని భావన్నారాయణ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న సంపత్ గణపతి పరివార్ ఈ ఏడాది కూడా మండపాన్ని అందంగా అలంకరించి 15 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. బాపట్ల కాకుమానువారిపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చీరాలలో వస్త్రవ్యాపారులు పెద్ద మండపాలను సిద్ధం చేసి గణనాధుడి పూజలకు సిద్ధమయ్యారు. అద్దంకి, రేపల్లె, వేమూరు, పర్చూరుతోపాటు పలు గ్రామాల్లో కూడా ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గత ఏడాది కంటే మండపాలు గణనీయంగా పెరగ్గా కార్యక్రమాలను ఆర్భాటంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు. సినీ సెట్టింగ్ తరహాలో చవి తి పందిళ్లను తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుత్ దీపా లతో పందిళ్లను శోభాయ మానంగా అలంకరించారు. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ఉత్సవాల్లో పాల్గొనేం దుకు ఉత్సాహం చూపు తున్నారు.



బాపట్ల రథం బజారులో చవితి పత్రి విక్రయం

### ఉచిత విద్యుత్‌పై హర్షం..

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం గణపతి ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ప్రకటించింది. ఈ మేరకు విద్యుత్‌శాఖకు మంగళవారం సాయంత్రం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉచిత విద్యుత్ అమలుతో నవరాత్రులు నిర్వహించే ఉత్సవ కమిటీలతో పాటు ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ఆయా వర్గాలు కృతజ్ఞతలు తెలిపాయి. భక్తుల విరాళాలతో ఉత్సవాలను నిర్వహించే కమిటీలకు ఉచిత విద్యుత్ పెద్ద ఊరటగా మారింది. గతంలో మండపాలకు వినియోగించే విద్యుత్‌కు కిలో వాట్‌కు రూ.2,400 ట్రాన్స్‌కో వసూలు చేసేది. భారీ మండపాలకు దాదాపు 20 కిలో వాట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తారు. ఈ ప్రకారం పెద్ద మండపాలకు రూ.18,900 నుంచి రూ.37,000 వరకు విద్యుత్ ఛార్జి ఖర్చయ్యేది. ఈ సారి ఉచిత విద్యుత్‌తో ఆ మేర భారం తగినట్లేనని ఉత్సవ కమిటీలు తెలిపాయి. ప్రతి మండపానికి బుధవారం సాయంత్రానికి మీటర్లు ఏర్పాటు చేసి ఏ మేరకు విద్యుత్ వినియోగించుకున్నారో రీడింగ్ తీసి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీని ఆధారంగా ట్రాన్స్‌కోకు విద్యుత్ ఖర్చును ప్రభుత్వం చెల్లించనున్నది.





బాపట్ల : మట్టి వినాయక విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం.

### ఊరేగింపులు.. కొనుగోళ్ల సందడి..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వినూత్న రూపాల్లోని విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. దీంతో తయారీదారుల నుంచి విగ్రహాలను కొను గోలు చేసిన ఉత్సవ నిర్వాహకులు ఊరేగింపుగా మండపాలకు తరలించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. డప్పువాయిద్యాలతో యువకులు హడావుడి చేశారు. వినాయక ప్రతిమలు, పత్రి, పూజా సామగ్రి విక్రయాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. మంగళవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశాయి.



బాపట్ల : ట్రక్కు ఆటోలో వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళుతున్న యువత

# 9 గ్రామాలకు.. తీపికబురు

ఎస్సీ జనాభా ఎక్కువ ఉన్న పల్లెలకు రూ.40 లక్షలు

**రోడ్లు, కాల్వలు, సామాజిక భవనాల నిర్మాణానికి వినియోగం**



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి )

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తొమ్మిది గ్రామాలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న పంచాయతీలకు అదనపు నిధులను విడుదల చేసింది. ఎంపిక చేసిన గ్రామాల్లో రూ.40 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద రూ.20 లక్షలతో పాటు ఉపాధి హామీ పథకం నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా మరో రూ.20 లక్షలు ఎంపిక చేసిన ఒక్కో గ్రామానికి కేటాయించారు. ఎస్సీ జనాభాను ప్రామాణికంగా తీసుకుని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని గ్రామాలను ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేశారు. గ్రామ జనాభాలో ఎస్సీలు 50 శాతం కన్నా ఎక్కువ ఉంటారో ఆ గ్రామాలను ప్రస్తుతం ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తొమ్మిది గ్రామాల్లో ఎస్సీ జనాభా ఎక్కువ ఉంది కాబట్టి ఈ అదనపు నిధులు పొందేందుకు అర్హత సాధించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు ఎస్సీ జనాభా ప్రమాణికంగా విడుదలైనా ఖర్చు మాత్రం గ్రామంలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ వినియోగించుకోవచ్చు. సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, సామాజిక భవనాలు, తాగునీటికి అవసరం అయిన పనులను కూడా చేసుకోవచ్చు.

**ఎంపికైన గ్రామాలు**

**గుంటూరు జిల్లా:** ఐనవోలు (తుళ్లూరు), అన్నవరం (పెదనందిపాడు), బ్రాహ్మణ కోడూరు(పొన్నూరు) **బాపట్ల జిల్లా:** అనంతవరం, ఈపూరు (కొల్లూరు), ఈతేరు(బాపట్ల), మోపర్రు (అమృతలూరు) **పల్నాడు జిల్లా:** అందుకూరు (క్రోసూరు), ముతనపల్లి (రొంపిచర్ల)

**గ్రామాభివృద్ధికి అవకాశం**

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద విడుదలైన అదనపు నిధులతో గ్రామీణాభివృద్ధికి సువర్ణ అవకాశం వచ్చినట్లే. ఈ నిధులు వినియోగించి ఆయా గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు మెరుగు పర్చుకోవచ్చు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా తదితర సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది.



\- వీర్ల జ్యోతిబసు, సీఈఓ

# బార్ లైసెన్సు.. సైలెన్స్

- దరఖాస్తులపై స్పందన నిల్
- బార్లపై ఆసక్తి చూపని వ్యాపారులు
- బాపట్ల జిల్లాలో 15 బార్లకు సున్నా దరఖాస్తులు
- గుంటూరు జిల్లాలో 92, పల్నాడులో 40 బార్లకు..
- మూడు జిల్లాలో 176 బార్లలో 29కి 75 దరఖాస్తులు
- మళ్లీ 29 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన బార్ పాలసీపై వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. గత వైసీపీ హయాంలో ప్రభుత్వ వైన్స్‌ను తొలగించి ప్రైవేటుగా వైన్స్‌లకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపగా పెద్ద ఎత్తున వ్యాపారులు ముందుకు వచ్చారు. దరఖాస్తు ఫీజుల రూపంలోనే రూ.కోట్లలో ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో బార్లకు కూడా పెద్దఎత్తున పోటీ వస్తుందని ప్రభుత్వం ఆశించింది. అయితే కనీస స్థాయిలో కూడా వ్యాపారులు స్పందించక పోవడం గమనార్హం. వైన్స్‌కు లాగానే ఒక్కొక్కరు ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా వ్యాపారుల నుంచి స్పందన లేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 176 బార్ల ఏర్పాటుకు ఈ నెల 18 నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా వాటిలో 75 మంది వ్యాపారులు ముందుకు వచ్చారు. ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో బార్ లైసెన్స్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాల్సి ఉంది. ఆ లెక్కన మూడు జిల్లాలో 176 బార్లకు 704 దరఖాస్తుల రావాల్సి ఉంది. అయితే 10.65 శాతం అంటే 75 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 92, పల్నాడులో 40 బార్లకు ఇప్పటి వరకు సున్నా దరఖాస్తులు రావడంపై అధికారులు ఆశ్చర్యపోతున్నారు. నగరపాలక సంస్థ, మున్సిపల్ పట్టణ, పంచాయతీల ప్రకారం బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తులకు గడువు మంగళవారంతో ముగిసింది. పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రధాన పట్టణాల్లో కూడా బార్ల ఏర్పాటుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు.

**ఆర్థిక భారమని వెనకడుగు..**

తొలుత బార్ల ఏర్పాటుకు ఆశావహులకు ప్రభుత్వం ఉచిత ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం కల్పించింది. దీంతో ఎక్కడికక్కడ పలువురు పేర్లను నమోదు చేసుకున్నారు. తీరా దరఖాస్తుల విషయానికి వచ్చే సరికి వెనక్కి తగ్గారు. ఉచిత ఎన్‌రోల్‌మెంట్ తర్వాత ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.10,000 చెల్లించడంతో పాటు దరఖాస్తు రుసుం రూ.5,00,000 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాలు నాన్‌రిఫండబుల్‌గా ప్రభుత్వం ప్రకటించింది. మార్గదర్శకాల ప్రకారం ఒక్కో షాపుకు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ ప్రక్రియ జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. మూడేళ్ల పాటు లైసెన్సును వర్తింపచేసేలా తొలి ఏడాదికి లైసెన్స్ రుసుం రూ.55 లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు, మూడో ఏడాది రూ.66.55 లక్షలుగా ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వీటిని బేరీజు వేసుకున్న వ్యాపారులు, ఆర్థికంగా భారమని తలచి దరఖాస్తులకు ముందుకు రాలేదని తెలుస్తోంది. పైగా మద్యం షాపులకు పర్మిట్ రూంలకు అనుమతి ఇవ్వడంతో వ్యాపారం సాగదని వ్యాపారులు బార్లకు దరఖాస్తు చేయడానికి ఆసక్తి చూపలేదన్న వాదన వినిపిస్తోంది. జిల్లాల్లో ఎక్కువగా వైసీపీకి చెందిన వ్యాపారులు బార్లు నిర్వహిస్తుండగా ప్రస్తుతం వారు తిరిగి ఆ వ్యాపారానికి ముందుకురానట్లు సమాచారం. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వ్యాపారులు మాత్రమే అక్కడక్కడ దరఖాస్తులు దాఖలు చేసినట్లు తెలిసింది. వచ్చే నెల 1 నుంచి నూతన బార్ పాలసీ అమల్లోకి వస్తుందని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. బార్ దరఖాస్తులకు వచ్చిన స్పందన మాత్రం అత్యంత తీసికట్టుగా ఉండడంతో (మిగతా 8వ పేజీలో)

● బాపట్ల జిల్లాలో 17 బార్లకు 68 దరఖాస్తులు రావాలి. అయితే 16 బార్లకు ఇంతవరకు స్పందనే లేదు. అద్దంకి పరిధిలోని ఓ బార్‌కు మాత్రం 5 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఒక్క బార్‌కు లైసెన్స్ ఫీజు తక్కువగా రూ.35 లక్షలు కావడం వల్లే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. జిల్లా కేంద్రమైన బాపట్లలోని ఓ బార్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.



# యూరియాకు కొరత లేదు

- రైతులకు అందుబాటులో ఎరువులు
- కర్లపాలెం మండలం పర్యటనలో కలెక్టర్

కర్లపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో ఎరువులు, పురుగు మందులకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. కర్లపాలెం మండలం యాజలిలో ఉన్న యాజలి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్‌ను, కర్లపాలెంలోని మనగ్రోమోర్ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. దుకాణంలో ఇప్పటి వరకు వచ్చిన ఎరువులు, విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 500టన్నుల యూరియా అవసరం ఉండగా 950టన్నుల యూరియాను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అనంతరం కలెక్టర్ యాజలిలోని రైతు ఉత్పత్తిదారుల కంపెనీని పరిశీలించి నిర్వాహకుడు ఇక్కుర్తి నరసింహారావుతో మాట్లాడారు. వీరి వెంట ఆర్డీవో గోర్లియా, వ్యవసాయశాఖ ఏడి అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ ఏడి కరుణశ్రీ, ఏవో సుమంత్‌కుమార్, తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపిడివో ఐనంపూడి శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



భోజనానికి విద్యార్థులతో కలిసి కూర్చున్న కలెక్టర్ జె. వెంకటమురళి

**విద్యార్థులను ఇష్టంగా చదివించాలి**
**: ఉపాధ్యాయులకు సూచన**

విద్యార్థి దశలో ఎలా చదివారో అలానే విద్యార్థులను ఇష్టంగా చదివించాలని యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతిరోజు ఇలానే భోజనం పెడుతున్నారా, రుచికరంగా ఉంటుందా, నాణ్యతతో తయారు చేస్తున్నారా, తిన్నంత భోజనం పెడుతున్నారా.. అంటూ బాలికలు నుండి వివరాలు అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ఏపీవో డీవీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో సురేష్, ఎంఇవోలు మనోరంజనీ, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో లేని వ్యవసాయ శాఖ సిబ్బంది

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి ఎప్పుడు వచ్చిన తాళం తీసి తలుపులు మాత్రం తీసి ఉంటాయని, సిబ్బంది మాత్రం ఒక్కరు కూడా కనిపించరంటూ రైతులు చెబుతున్నారు. మండల కేంద్రం కొల్లూరులోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయానికి ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు కోసం వచ్చిన రైతులకు కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. సీసీ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కౌలు రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అవసరమైన పత్రాలు తెచ్చి ఇవ్వాలని ఫోన్‌లో సమాచారం అందిస్తారు. తీరా వాటిని తీసుకు వస్తే ఇక్కడ ఎవరు కనిపించరు. అసలు వ్యవసాయాధికారి ఎప్పుడు కార్యాలయానికి వస్తారో వెళతారో కూడా తెలియని పరిస్థితి. వివిధ పనులపై ఆ కార్యాలయానికి వచ్చిన రైతులు సిబ్బంది లేకపోవడంతో పక్కనే ఉన్న ఆధార్ సేవ కేంద్రంలోని సిబ్బందిని సంప్రదిస్తే వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని చెప్పడంతో రైతులు చేసేదేమీ లేక ఆయా కేంద్రాలను వెతుక్కుంటూ వెళ్లాల్సి వసున్నది. ఇకనైనా కార్యాలయంలో అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరుతున్నారు.



మూసి ఉన్న కార్యాలయం

# ట్రంప్ ఆంక్షలు తిప్పి కొట్టాలి

- ఆక్వాను జాతీయ రంగంగా గుర్తించాలి
- అమెరికా నిర్ణయాలపై వ్యతిరేకంగా రైతు సంఘాల ఆగ్రహం

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఆక్వాను జాతీయ రంగంగా గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలను తిప్పి కొట్టాలని పలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వేటపాలెం ఆక్వా అసోసియేషన్ కార్యాలయంలో ఆక్వా రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల నిర్ణయంతో వ్యవసాయ, అనుబంధ రంగాలు సంక్షోభంలో పడుతున్నట్లు వివరించారు. మరోవైపు సుంకాలు అమలు ప్రారంభం కాకమునుపే రాష్ట్రంలో వ్యాపారులు కౌంట్ రొయ్యలకు సంబంధించి ధరలు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. భారత దేశం వ్యయసాయాధారితం కావడంతో డబ్ల్యూటీవో ఒప్పందాల వలన పూర్తిగా రైతులు పరిస్థితి దీనంగా మారుతుందని ఆవేదన చెందారు. దేశీయ మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. దేశ ఎగుమతులపై అమెరికా సుంకాలు విధించడం అన్యాయమని చెప్పారు. సామాన్య రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా ప్రభుత్వాలు వెంటనే దృష్టి సారించాలన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ ధరలు తగ్గించాలని కోరారు. త్వరలో అఖిలపక్ష రైతు సంఘాలతో ఉద్యమించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నేతలు హరిబాబు, ఆమంచి స్వాములు, తేళ్ల రామయ్య, సూర్యనారాయణ, జయంతిబాబు, రామారావు, కొండయ్య, సిఐటియు నేతలు బాబురావు, అయ్యప్పరెడ్డి, రాంబాబు, జరుగుల రమేష్, వెంకట రామయ్య, శంకర్ తదితర రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘాల నేతలు

# నదిలో పడవలపై నిషేధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు పడవలపై ప్రయాణికుల రాకపోకలు నిషేధించినట్లు తహసీల్దార్ బీ వెం కటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో అటు ఇటు అయితే జీవితం ఎటో అనే శీర్షిక ప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. మండల పరిధిలోని గాజుల్లంక లోని పుష్కరఘాట్ వద్దకు వెళ్లి అక్కడ పడవల నిర్వాహకులైన మత్స్యకారులతో మాట్లాడారు. కృష్ణానదిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండగా గాజుల్లంక-శ్రీకాకుళం మధ్య పడవల ద్వారా ప్రయాణికులను ఎందుకు చేరవేస్తున్నారని నిలదీశారు. చిన్న చిన్న పడవల ద్వారా ప్రయాణికులను చేరవేసే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని, పైగా ప్రయాణికుల భద్రత కోసం



పడవ ప్రయాణంపై మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మీ వద్ద ఎటువంటి లైఫ్ జాకెట్లు, ట్యూబ్‌లు లేకుండా పడవ ప్రయాణాలు చేయడం సరికాదని మందలించారు. ఇకపై కృష్ణానదిలో పడవల ద్వారా ప్రయాణికులను దాటిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పడవల లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ గ్రామ అధికారి, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అత్తోటలో వృద్ధురాలిపై దుండగుల దాడి

కొల్లిపర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అత్తోటలో వృద్ధురాలిపై దుండగులు దాడి చేసి సుమారు 12 సవర్ల నగలు అపహరించిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అత్తోట గ్రామానికి చెందిన బొల్లిముంత బుల్లెమ్మ ఇంటిలో ఉండగా ఆమెపై దుండగులు దాడి చేసి బంగారు గొలుసు, గాజులు తీసుకుని పరారయ్యారు. బుల్లెమ్మకు బలమైన గాయాలు అవ్వడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.







# పేరు మార్చి.. ఏమారుస్తున్నారు



- నార్త్ ఈస్టు పోయే... అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వచ్చే
- మళ్లీ భయపడిపోతున్న మిర్చి ఎగుమతిదారులు
- కొత్త అసోసియేషన్ వెనక గతంలోని వ్యక్తులున్నారని అనుమానాలు
- అసోసియేషన్‌కి, లారీ కిరాయిలకు సంబంధం ఏమిటని ప్రశ్నలు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు పాటించాలని కోరుతున్న ట్రేడర్లు

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్‌కు మిర్చి ఎగుమతులను దెబ్బతీసిన నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసి యేషన్ పీడ సీఎం చంద్రబాబు కఠినమైన ఆదేశాలుతో తొలగిపోయింది. ఆ అసోసియేషన్ ఇప్పటికే మూత పడగా మళ్లీ ఇప్పుడు కొత్తగా మరో సంఘం పుట్టుకొచ్చింది. పేరు మార్చుకొని శ్రీ అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా కొంతమంది వ్యక్తులు తమని తాము పరిచయం చేసుకొంటూ ది గుంటూరు చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్‌కు లేఖ రాయడం మిర్చి ట్రేడ్‌లో చర్చనీయాంశంగా మారింది. కొత్తగా లారీ యజమానులు ఎవరూ రాలేదని, పాత వాళ్లే వేరే పేరుతో మెల్లమెల్లగా వచ్చి ఏకు మేకుగా మారి మళ్లీ ఏకచత్రాధిపత్యం వహించాలని చూస్తున్నారన్న అనుమానాలను ఎగుమతిదారులు వ్యక్తపరుస్తున్నారు.

గుంటూరు నుంచి నిత్యం ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతులు వెళుతుంటాయి. దీనిని అవకాశంగా చేసుకొన్న కొందరు వైసీపీ నాయకులు నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ అని స్థాపించి విపరీతంగా కిరాయిలు వసూలు చేశారు. దాంతో మిర్చి ఎగుమతిదారులు బెంబేలెత్తిపోయారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోల్చితే దాదాపుగా ఇక్కడ లారీ కిరాయి రూ. 30 వేలకు పైగా అధికంగా ఉండటంతో మిర్చి వ్యాపారం తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు కదిలిపోయింది. ఒకదశలో ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి లారీ ఎక్స్‌పోర్టుకు పెట్టాలంటేనే వ్యాపారస్థులు భయపడిపోయారు. ఇందుకు కారణం అసోసియేషన్‌కు సంబంధం లేకుండా వేరే ఎవరైనా లారీ మాట్లాడుకొంటే సంఘం ముసుగులో రౌడీలు వచ్చి అడ్డుకునేవారు. లారీ టైర్లు కోసేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

ఈ విషయం గత ఏడాది సీఎం చంద్రబాబుకు ఇక్కడి వ్యాపారస్థులు నివేదించడంతో ఆయన వెంటనే స్పందించి డీజీపీకి ఆదేశాలు ఇచ్చారు. వ్యాపారస్థుల అభీష్టం మేరకు లారీలు కిరాయికి పెట్టుకునే వాతావరణం కల్పించాలని, ఎవరైనా అడ్డుపడితే కఠినమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దాంతో ఇక్కడి పోలీసులు కఠినంగా వ్యవహరించారు. లారీని కిరాయికి పెట్టుకునే విషయంలో వ్యాపారస్థులకు స్వేచ్ఛ కల్పించారు. ఈ కారణంగా ఖమ్మం జిల్లాకు తరలిపోయిన మిర్చి బిజినెస్‌లో చాలావరకు మళ్లీ వెనక్కు వచ్చేసింది. మరోవైపు వ్యాపరస్థులు ధర కూడా పెంచడంతో రైతుకు ప్రస్తుతం క్వింటాల్‌కు రూ. 14,500 వరకు లభిస్తున్నది.

కాగా శ్రీ అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో ఒక లేఖని ది గుంటూరు చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్‌కు పంపించారు. అందులో అసోసియేషన్ లారీకి లోడింగ్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాము నిర్ణీత సమయానికి, నాణ్యమైన సేవలతో మిర్చిని రవాణ చేస్తామని చెబుతూ ప్రతీ రోజు లోడింగ్ పనులు తమ సంఘం లారీలకు కల్పించాలని కోరారు. న్యాయమైన పోటీ ధరలతో రవాణ సేవలు అందిస్తామని ప్రతిపాదించారు. చిల్లీస్ అసోసియేషన్‌తో చర్చించిన తర్వాత కిరాయి నిర్ణయిస్తామంటూ సహకరించాలని కోరారు. అయితే వ్యాపారస్థులు మాత్రం సాఫీగా సాగిపోతున్న కిరాయిల విషయంలో మళ్లీ అసోసియేషన్ పేరు ప్రస్తావన తీసుకురావడం సరికాదని చెబుతున్నారు. ఏమైనా అడ్డు చెబితే తాము నేరుగా సీఎంని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

## డేటా ఆధారిత పాలనకే పంచాయతీ అభివృద్ధి సూచిక

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి పురోగతిని అంచనా వేయడానికి, డేటా ఆధారిత పాలనను ప్రోత్సహించడానికి పంచాయతీ అభివృద్ధి సూచిక దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్‌లో పంచాయతీ అభివృద్ధి సూచికపై జడ్పీటీసీలు, మండల పరిషత్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. జాతీయ స్థాయిలో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేయడానికి పంచాయతీ అభివృద్ధి సూచిక వ్యూహాత్మక సాధనంగా పనిచేస్తుందని చైర్‌పర్సన్ అన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతిబసు మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో 9 స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల థీములపై పురోగతిని కొలిచి, లోపాలను గుర్తించటంలో పంచాయతీ అభివృద్ధి సూచిక కీలకంగా ఉంటుందని అన్నారు. ఈ విధానం వల్ల పంచాయతీల పనితీరును గ్రేడ్ల రూపంలో చూపించి, వాటికి బాధ్యత ఉండేలా చేస్తుందని, తద్వారా పారదర్శకత పెరగటంతో పాటు ప్రజలకు స్పష్టత ఉంటుందని అన్నారు. డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయికుమార్, బాపట్ల ఈటీసీ కేంద్రం నుంచి శ్రీనివాసరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.





శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు, డీపీఓ సాయికుమార్

## శతాధిక వృద్ధుల సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శతాధిక వృద్ధులకు సత్కారం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో శతాధిక వృద్ధుల సత్కారం కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన నూరేళ్లు పూర్తిచేసుకున్న వయోవృద్ధులను గుర్తించి వారినందరినీ ఒకే వేదికపై ఉంచి ప్రముఖుల చేతులమీదుగా సత్కరించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 12 సార్లు 17 మంది శతాధిక వృద్ధులను గుర్తించి సత్కారం చేశామన్నారు. నూరేళ్లు పూర్తిచేసుకున్న వారు వచ్చేనెల 10లోపు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో స్వయంగా కానీ, 9848111138, 9347572766 ఫోన్ నంబర్లలో కానీ నమోదు చేయించుకోవాలని కోరారు. శతాధిక వృద్ధుల సత్కారం ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, కే మధుసూదనరావు, పీ లక్ష్మీ నరసింహరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.



శతాధిక వృద్ధుల సత్కారం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీలు

## 14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



విజయపురిసౌత్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో మంగళవారం ప్రాజెక్ట్ అధికారులు 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటి మట్టం 585.90 అడుగులు ఉంది. ఇది 300.03 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8807 క్యూసెక్కులు, ప్రధా న జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,739 క్యూసెక్కులు, 14 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,07,338 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ గా 1,61,971 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,61,971 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

### టెయిల్‌పాండ్ నుంచి 1,32,556 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన వున్న పులిచింతలకు 9 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 1,32,556 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ,ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు చెప్పారు.ప్రాజెక్టుకున్న 20 గేట్లకుగాను 8 గేట్లను 3 మీటర్లు,1 గేట్‌ను 1.5 మీటర్ల మేర ఎత్తామన్నారు. ఎగువన వున్న సాగర్ నుంచి 1,41,077 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.45 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.011 టీఎంసీలకు సమానమన్నారు.విద్యుదుత్పత్తిని రెండు యూనిట్ల ద్వారా ప్రారంభించామని మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 35.0 మెగావాట్ల కరెంట్ తయారైందన్నారు.



టెయిల్‌పాండ్ నుంచి 9 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న కృష్ణమ్మ

## బార్ లైసెన్సు.. సైలెన్స్

(7వ పేజీ తరువాయి)

ఈ నెల 29 వరకు గడువు పెంచింది. అప్పటికీ దరఖాస్తుల విషయంలో ఇదే రీతిలో స్పందన ఉంటే తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

- గుంటూరు జిల్లాలో 110 బార్లు ఉండగా కేవలం 18 బార్లకు మాత్రమే 47 దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఆరు బార్లకు నాలుగు, మంగళగిరిలో మూడు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి.
- పల్నాడు జిల్లాలో 49 బార్లలో 9 బార్లకు మాత్రమే 22 దరఖాస్తు వచ్చాయి. సత్తెనపల్లిలో మూడు బార్లకు 10, దాచేపల్లి, గురజాలలో ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. చిలకలూరిపేటలోని 10, పిడుగురాళ్లలో 6, మాచర్లలోని 4, వినుకొండలోని 6 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 17 బార్లకు నాలుగు బార్లకు మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి.

## తెలుగుభాషకు పుట్టినిల్లు బాపట్ల : చక్రపాణి

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగులిపి బాపట్ల జిల్లాలోనే పురుడు పోసుకోవటం విశేషమని ఆంధ్రప్రదేశ్ మానవనరుల అభివృద్ధి సంస్థ పూర్వపు డైరెక్టర్ డి.చక్రపాణి పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీన తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫోరంఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీ సీ.సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చక్రపాణి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో తొలికిరణాలు బాపట్ల నుంచే ప్రసరించాయన్నారు. తెలుగుపద్యం కూడా బాపట్ల గడ్డమీదే పుట్టిందని ఆయన తెలిపారు. స్థానిక సరస్వతీమెమోరియల్ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్రకారుడు జీవి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్,వీఆర్వో సంస్థ అధినేత వేలాంగిని, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చక్రపాణి తదితరులు

## పీఎంవీబీఆర్‌వై ద్వారా యజమానులకు ఆర్థిక ఉపశమనం

● డీఆర్‌ఎం సుధేష్ణ సేన్



ఈపీఎఫ్‌వో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం ద్వారా కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి అవసరమైన ఆర్థిక ప్రయోజనాలను అందించడం ద్వారా నూతన ఉపాధి అవకాశాలను సృష్టించడానికి యజమానులను ప్రోత్సహించడమే లక్ష్యమని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఈ స్కీమ్‌పై ఈపీఎఫ్‌వో సంస్థ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి పీఎఫ్ ఆఫీసు అసిస్టెంట్ కమిషనర్ పీ గోపాల్ సింగ్ అధ్యక్షత వహించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ పీఎంవీబీఆర్‌వై కింద కేంద్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగులకు, యజమానులకు ప్రయోజనాలను నిర్దిష్ట కాలానికి చెల్లిస్తుందన్నారు. తద్వారా యజమానులపై ఆర్థికభారాన్ని తగ్గిస్తుందన్నారు. అలానే వివిధ రంగాల్లో ఉద్యోగాలకల్పనను ప్రోత్సహిస్తుందనఇ చెప్పారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రముఖుల వినాయకచవితి శుభాకాంక్షలు

రేపల్లె, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వినాయకచవితి సందర్భంగా విఘ్నాలు తొలగి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆకాంక్షించారు. తొలిపూజలు అందుకునే ఆదిదేవుడు సకల గణాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడిని అనుగ్రహంతో విఘ్నాలు లేకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. మతసమరస్యాలను చాటేలే భక్తిశ్రద్ధలతో ఘనంగా వినాయకచవితి పండుగ నిర్వహించాలని కోరారు. పర్యావరణానికి హానిచేసే రసాయనక రంగులు ప్లాస్టాఫ్‌క్యారీస్‌తో తయారచేసిన విగ్రమాలకు బదులుగా పర్యావరణాన్ని కాపాడే మట్టిగణపతులను పూజించాలని వారు కోరారు.

## పరారీలో షోరూం నిర్వాహకుడు..!

● సుమారు రూ. 20 కోట్లకు పైగా అప్పులు..

మాచర్లటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని ఓ ప్రముఖ షోరూం నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు నిర్వాహకుడు రూ. 20 కోట్లకు పైగా అప్పులు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నిమార్లు ఫోన్ చేసినా నిర్వాహకుడు స్పందించడం లేదని రుణదాతలు లబోదిబోమంటున్నారు. పట్టణంలోని షోరూం గత పది రోజులుగా తెరవకపోవడంతో నిర్వాహకుడు పరారైనట్లు భావిస్తున్నారు. సదరు నిర్వాహకుడు పలుచోట్ల బ్రాంచీలను ఏర్పాటు చేసి ఆయా చోట్ల కూడా భారీగా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అప్పులిచ్చిన వారు జిల్లా ఎస్పీని కలవనున్నట్లు సమాచారం. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

## కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారికి మహిళ ఫిర్యాదు

● ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ కానిస్టేబుల్ సెల్ఫీ వీడియో



ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్

మాచర్ల రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తన పట్ల మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్ అసభ్యంగా ప్రవర్తించాడంటూ పట్టణానికి చెందిన ఓ మహిళ జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో మనస్తాపం చెందిన కానిస్టేబుల్ షరీఫ్ మహిళ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ మంగళవారం సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ సెల్ఫీ వీడియో కలకలం రేపుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్ తన భార్యకు విడాకులిచ్చి పట్టణంలోని కొత్తపల్లి జంక్షన్లో గల ఓ టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఓ మహిళతో చనువుగా వ్యవహరిస్తున్నారు. సదరు మహిళ తన భర్తతో కలిసి తన వద్ద నుంచి భారీగా నగదు కాజేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు షరీఫ్ తన సెల్ఫీ వీడియోలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానంటూ తనను బెదిరించడమే కాకుండా పోలీసుశాఖ జిల్లా ఉన్నతాధికారిని కలిసి ఫిర్యాదు కూడా చేసినట్లు చెప్పారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ షరీఫ్ సెల్ఫీ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ సంఘటనపై రూరల్ ఎస్ఐ సంధ్యారాణిని వివరణ కోరగా.. కానిస్టేబుల్ షరీఫ్ సెల్ఫీ వీడియోపై విచారణ జరుగుతుందని, నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు.

## జూనియర్ ఇంటర్ విద్యార్థి అదృశ్యం



కాకాని తులసీరామ్ (ఫైల్)

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట ఒకటో లైన్‌లో రైల్వేస్టేషన్ వద్ద పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెం గ్రామానికి చెందిన కాకాని తులసీరామ్ (17) అదృశ్యమయ్యాడు. తులసీరామ్ గుంటూరులోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ చిల్లీస్ రెస్టారెంట్ దగ్గరలోని హాస్టల్లో ఉంటున్నాడు. ఈ నెల 25న ఉదయం నుంచి కనిపించకుండా పోయినట్లు బాలుడు తండ్రి కాకాని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రోజా లత తెలిపారు.

## రేపల్లె ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి ప్రయాణం పునరుద్ధరణ

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వర్కులు కారణంగా చర్లపల్లి వరకే ప్రయాణించి ఆగిపోతున్న రేపల్లె ఎక్స్‌ప్రెస్‌ని తిరిగి సెప్టెంబరు 10వ తేదీ నుంచి పాత కాలమానపట్టిక ప్రకారం ప్రయాణించ నుంది. నంబరు. 17645 సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్ నిత్యం మధ్యాహ్నం 12.40కి బయలుదేరుతుంది. నంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3.55కి సికింద్రాబాద్ చేరుకొంటుందని సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 111, 119, 130 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 210.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 220.00 |

## 58,321 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 60,157 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 58,321 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,337 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 10000 | 14500 | 334 | 10500 | 14000 |
| నెంబరు. 5 | 10000 | 13500 | నెంబరు. 5 | 10000 | 13600 |
| 273 | ---- | ---- | 273 | ---- | ---- |
| 341 | 10000 | 15300 | 341 | 11000 | 15400 |
| 4884 | ---- | ---- | 4884 | 10000 | 13000 |
| సూపర్ 10 | 10000 | 13800 | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | తేజ | 10000 | 15300 |
| తేజ | 10000 | 15200 | బ్యాడిగి 355 | 10000 | 14000 |
| షార్క్-1 | ----- | ---- | దేవనూర్ డీలక్స్ | 10500 | 13600 |
| బ్యాడిగి 355 | 10000 | 14800 | ఆర్మూరు | ---- | ---- |
| దేవనూరు డీలక్స్ | 10000 | 14000 | తాలుకాయలు | 5000 | 7600 |
| ఆర్మూరు | 9800 | 12000 | | | |

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



బ్యాగ్‌లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి, సహృదయ ఫౌండేషన్ సభ్యులు

### ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలి : కమిషనర్

బాపట్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు తయారు చేసిన బ్యాగ్‌లను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వల్ల అనేక నష్టాలు వాటిల్లుతాయని. ప్రమాదకరమైన క్యాన్సర్‌లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతిఒక్కరు ప్లాస్టిక్ నిషేధించి గణనాథుని సాక్షిగా ప్రతిజ్ఞ బూనాలని కోరారు. కార్యక్రమంలో డీఈ ఎస్‌ఏస్ఆర్ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ కరుణ, సంపత్ గణపతిపరివార్ నాయకులు బి.బాబునాగేంద్ర, విశ్రాంత కమిషనర్ రామశర్మ, మోహన్, వల్లి, కృష్ణప్రియ, కాళీదాసు, మామిడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మట్టి విగ్రహాలను పూజిద్దాం : విన్నకోట

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని జనసేననాయకుడు, అఖండఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తెలిపారు. పట్టణంలో మంగళవారం అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రథంబజారులోని శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం దగ్గర విగ్రహాలను పంపిణీ చేశారు. భక్తులకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో బి.బాబునాగేంద్ర, చేజర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : కమిషనర్

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలువారి ఆధ్వర్యంలో బాపట్ల పాతబస్టాండ్ వద్ద మంగళవారం ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అసిస్టెంట్ ఇంజనీర్ వై.భాస్కర్ వర్మ, ప్రొటెక్ట్ ఎన్జీవో మెంబరు చంద్రారెడ్డి, ఐటీసీ ప్రతినిధి ఎంఎస్ఎన్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, న్యాయవాది భోగిరెడ్డి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గడియార స్తంభంసెంటర్లో మంగళవారం సాయితేజ కన్‌స్ట్రక్షన్స్, సాయితేజ జ్యూయలర్స్ అధినేత గంటా నవీన్ ఆధ్వర్యంలో మట్టివినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణి చేశారు.

### పాఠశాలలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు మెరుగుపరచాలి

కర్లపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యాజలి ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఇంకా ఉత్తమైన దానిగా చేయాలని బాపట్ల జిల్లా విద్య అకడమిక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.

## నల్ల బర్లీ కొనుగోలుకు ముందుకొచ్చిన ప్రభుత్వం

● కలెక్టర్ జె.వెంకటమురళి



ఎఫ్‌సీఐ గోదాంలో నల్ల బర్లీ పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

కర్లపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వం ప్రకటించిన మాదిరిగానే రైతుల నుంచి కొనుగోలు చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి స్పష్టం చేశారు. మండలంలోని నల్లమోతువారిపాలెం ఎఫ్‌సీఐ గోదాంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బ్లాక్ బర్లీని కొనుగోలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. ఎఫ్‌సీఐ గోదాంలో ఉన్న రైతులతో ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసి నగదు చెల్లిస్తుందని ఆధైర్యపడవద్దని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, మార్క్‌ఫెడ్ ఏడీ కరుణశ్రీ, మహిళా సంక్షేమశాఖ పీడీ రాధామాధవి, వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణ, డీపీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

### స్వామిత్వ సర్వే సక్రమంగా చేయాలి

స్వామిత్వ సర్వే పక్కాగా చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. మండలంలోని దుండివారిపాలెంలో సర్వేప్రక్రియను మంగళవారం వెంకటమురళి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 211 గ్రామాల్లో సర్వే జరుగుతుందని సాంకేతిక యంత్రాల అవసరతను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ ద్వారా చేసిన సర్వే మ్యాపింగ్ ప్రక్రియకు క్షేత్రస్థాయిలో నిర్వహించే సర్వేకు స్వల్ప తేడా ఉండటంపై ఆరాతీశారు. సర్వేసిబ్బందికి క్షేత్రస్థాయిలోనే శిక్షణ ఇవ్వాలన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం పనితీరుపై కలెక్టర్ అసహనం

అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్యాబోధన జరగాలని కలెక్టర్ సూచించారు. ఎంవీ రాజుపాలెంలోని కోడ్ నెంబరు 128 అంగన్‌డాడీ కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీస్కూల్ నిర్వహణపై ఆరాతీశారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ఎదుగుదల గురించి వివరాలు అడిగారు. అంగన్‌వాడీ కార్యకర్త అడిగిన ప్రశ్నలకు చిన్నారులు సరిగ్గా స్పందించకపోవటంతో కలెక్టర్ ఆసహనం వ్యక్తం చేశారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని అంగన్‌వాడీ కార్యకర్త ఆయాలను కలెక్టర్ ఆదేశించారు. వీరి వెంట ఆర్డీవో పి.గ్లోరియా, వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణ, డీపీవో ప్రభాకరరావు, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ రాధామాధవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

● ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జిల్లా ప్రజలు వినాయకచవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలలో పందిళ్ళు, మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేవారు తప్పనిసరిగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలన్నారు. సింగిల్‌ఇండో విధానంలో వెబ్‌సైట్ ద్వారా అనుమతులు సులభంగా పొందవచ్చుఅని చెప్పారు. ఉదయం 6గంటలు నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని అధిక ధ్వనులు సృష్టించే పరికరాలను వినియోగించరాదని తెలిపారు. ఎక్కడైన సమస్యలు తలెత్తితే 100, 112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

### ఆయుష్మాన్‌భారత్ డిజిటల్ మిషన్‌పై శిక్షణ

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్‌భారత్ డిజిటల్ మిషన్ మీద ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు, ఫార్మసిస్ట్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏబీడీఎం ప్రధాన లక్ష్యం సమగ్రమైన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను తీసుకురావటమన్నారు. తద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలను అందరికి అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయుష్మాన్‌భారత్ హెల్త్ అకౌంట్‌నెంబరు అనేది ఒక డిజిటల్ హెల్త్‌ఐడీ లాంటిదని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ కన్సల్టెంట్‌లు సుశీల, డీపీఎంవో డాక్టర్ మనోజ్, డీపీవో ప్రేమపావని తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ శుద్ధి.. అభిషేకాలు



వేమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వార్షిక గణపతి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభించేందుకు ఆగమ శాస్త్ర ప్రకారంగా మంగళవారం ఆలయాల శుద్ధి.. అభిషేకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. జంపనిలో సిద్ధి గణపతి రత్నగర్భ గణపతి ఆలయాలు వేమూరులోని సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీ గణపతి ఆలయాలను శుభ్రపరిచారు. మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం అనంతరం జలాభిషేకం చేశారు.

#### భావదేవుని సన్నిధిలో...

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈఏడాది కూడా శ్రీసంపత్ గణపతి కొలువుతీరారు.

### మదర్‌థెరిస్సాకు ఘన నివాళి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో అధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి నిర్వహించారు. మధర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అక్కల సుబ్బారెడ్డి, చిన కోటిరెడ్డి, పి.రాజేంద్ర, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు. మంతెనవారిపాలెం, చందోలు, ఖాజీపాలెం, శాఖా గ్రంథాలయాల్లో మదర్‌థెరిస్సా జయంతి నిర్వహించారు.

### చట్టాలపై అవగాహన కలిగియుండాలి

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరు చట్టాలు గురించి అవగాహన కలిగియుండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆంధ్రకేసరినగర్‌లో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.



వేమూరులో ఎరువుల దుకాణాల్లో సరుకును పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు

### ఎరువుల చట్టం ప్రకారం అమ్మకాలు జరపాలి

వేమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధి గ్రామాల్లోని లైసెన్స్ ఎరువుల దుకాణదారులు నియంత్రణ చట్టం ప్రకారం ఎరువులను అమ్మాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుశీల అన్నారు. మంగళవారం మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను సందర్శించి సరుకును పరిశీలించారు. ఏవో ప్రేమ్‌సాగర్, వీఆర్వో జితేంద్ర, ఏఎస్‌ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

### వ్యవసాయ భూముల రీసర్వేపై అవగాహన

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : స్వమిత సర్వే, వ్యవసాయ భూముల రీసర్వేపై డీటీ శాంతలక్ష్మి మహిళలకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సమాఖ్య కార్య నిర్వహణ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి శాంతలక్ష్మి హాజరై మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వమిత గృహ సర్వే, వ్యవసాయ భూముల రీసర్వే గురించి సమావేశంలో వివరించారు. సూపర్‌వైజర్ శివరామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు పలు అంశాలపై వివరించారు. సమావేశంలో ఈసీ, వీవోఏ, సీసీలు పాల్గొన్నారు.

### మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందిన వ్యక్తి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమరవర్ధన్ మంగళవారం తెలిపారు. కొల్లూరు బోసునగర్‌కు చెందిన సబావత్ గోపయ్య సోమవారం రాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి తల్లి, బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

### హెచ్ఐవీపై బాల బాలికలకు అవగాహన

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిపై బాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి, సిరి మహిళా సాధికారిక వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. ఐసీటీసీ కౌన్సిలర్ పేరమ్మ, ఎస్ఎంఎస్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు మేనేజర్ రవీంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో జి.సునీత, జె.రాజు, కమల్‌హాసన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సినీపరిశ్రమ నూతన పాలసీలో కార్పొరేట్ హవా ప్రమాదం

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సినీపరిశ్రమ నూతన పాలసీలో కార్పొరేట్ హవా ప్రమాదకరమని సినీ దర్శకుడు, మా-ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా అన్నారు. సూర్యలంక సముద్రతీరంలో షూటింగ్ నిమిత్తం లోకేషన్‌ల ఎంపిక కోసం వచ్చిన ఆయన ప్రైవేట్ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సినీపరిశ్రమకు రానున్న నూతనపాలసీలో కార్పొరేట్ హవా ఉందన్నారు. పరిశ్రమపై ప్రైవేట్ పెత్తనం వల్ల ప్రభుత్వాజోక్యం తగ్గుతుందన్నారు.

## రావయ్యా వినాయకా.. ఆతిథ్యం స్వీకరించయ్యా..

● చవితికి చలువపందిళ్ళు సిద్ధం



గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తీరంలో వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందు కు పట్టణ, గ్రామాల వాసులు పెద్దపెద్ద పందిళ్ళు వేసి ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ నుంచి వచ్చిన వినాయక విగ్రహాలను అయిదు నుంచి 20 వేల రూపాయల వరకు విక్రయించేందుకు వివిధ రకాల సైజుల్లో పట్టణంలోని ప్రకాశం రోడ్డులో కన్యకాపరమేశ్వరి గుడి వద్ద, ఏబీఆర్ డిగ్రీ కళాశాల, రాజ్యలక్ష్మి సెంటర్‌లో ఏర్పాటు చేశారు. పట్టణం, మండల గ్రామాల్లోని ప్రజలు మంగళవారం సాయంత్రం విగ్రహాలను ఊరేగింపుగా తమ తమ పందిళ్ళకు తీసుకొచ్చారు. విగ్రహాలు శివుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నందీశ్వరుడి, తదితర దేవతల భంగిమల్లో శోభాయమానంగా తీర్చిదిద్దిన విగ్రహా లను ప్రజలు చూసి తరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు మట్టిగణపతిని తయారుచేసి పంచిపెట్టారు.

#### బాపట్ల రథంబజారులో..

బాపట్ల, ఆగస్టు 26 (అంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని బాపట్ల పట్టణంలోని రథంబజారులో మంగళవారం పెద్దఎత్తున సందడి నెలకొంది. వినాయకుని విగ్రహాలతోపాటు పత్రి విక్రయాలతో కిక్కిరిసింది. రథంబజారు, ఇటు సూర్యలంకరోడ్డు,జీబీసీరోడ్డుకు ఇరువైపుల విక్రయదుకాణాలు పెట్టారు. మట్టివినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. పర్యావరణహితమైన మట్టివినాయక విగ్రహాన్ని పూజిద్దాం అంటూ పలువురు ఉచితంగా విగ్రహాలు పంపిణి చేశారు.

#### కర్లపాలెం మండలంలో..

కర్లపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీల్లో వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఆయా గ్రామాలకు వినాయక విగ్రహాలను ట్రక్టర్‌లు, ఆటోట్రక్కులు, లారీల్లో పెద్ద విగ్రహాలను పోటీలు పడి తరలించారు. విగ్రహాలు, పత్రి కొనేందుకువచ్చిన ప్రజలతో మార్కెట్ సెంటర్ సందడిగా ఉంది.

● అమృతలూరు, ఆగస్టు 26 (అంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఆయా గ్రామాల్లోని కూడలి వద్ద, ఆలయాల వద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు నిర్వాహకులు పూర్తి చేశారు. మండపాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులో పలు కూడళ్ల వద్ద వినాయక పూజకు అవసరమైన సామగ్రి, పత్రిని అమ్మకాలు చేస్తున్నారు. కొల్లూరుతో పాటు మండల గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు 50కి పైగా దరఖాస్తులు అందినట్లు ఎస్ఐ అమరవర్ధన్ తెలిపారు.

#### అంకుర గణపతులనే పూజిద్దాం

చెరుకుపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ నినాదంతో స్వచ్ఛమైన మట్టి మొక్కలు నాటుకునేలా ఓ విత్తనంతో తయారుచేసిన అంకుర గణపతి ప్రతిమలను ఏఎస్‌పీ చారిటబుల్ ట్రస్ట్ రేపల్లె వారి ఆధ్వర్యంలో ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

#### వినాయక ప్రతిమగా విద్యార్థుల మానవహారం

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భాష్యం స్కూల్ ప్రాంగణంలో మంగళవారం విద్యార్థులు వినాయక ప్రతిమగా మానవహారం ఏర్పాటు చేశారు.



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

### పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి


● ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం కర్నూలులో నిర్వహించిన పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంకిత భావంతో పార్టీకి పని చేసిన వారందరికి పార్టీ సంస్థాగత ఎన్నికల్లో సముచిత స్థానం దక్కుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మంత్రులు ఎం.రాంప్రసాద్‌రెడ్డి, టీజీ భరత్, కర్నూలు పార్లమెంట్ సభ్యులు పంచలింగాల నాగరాజు, పార్థసారధి పాల్గొన్నారు.

### మట్టివినాయక విగ్రహాలను పూజించాలి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణా న్ని కాపాడే యజ్ఞంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవుదామని చందోలు లింగోద్భవ దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు పరిమి రామకృష్ణసాయిబాబు అన్నారు.


నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులో ఏర్పాటు చేసిన గణపతి మండపం



వినుకొండ : గణపతి మానవహారంగా ఏర్పడిన గీతాంజలి విద్యార్థులు


తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులో విక్రయిస్తున్న పూలు, దండలు


పొన్నూరు : విక్రయాలకు సిద్ధంగా ఉన్న మట్టి గణనాథులు

# కొలువైన గణనాథులు

గణపతి మహోత్స వాలకు పల్లెలు, పట్టణాలు సిద్ధమయ్యాయి. చవితి ఉత్సవాలను ఉత్సాహంగా చేసుకునేందుకు భక్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. గత ఏడాదికంటే అధికంగా ఈ ఏడు పెద్దసంఖ్యలో వినాయక మండపాలు వెలిశాయి. ఆయా మండపాల్లో వివిధ రూపాల్లోని భారీ వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. బుధవారం స్వామివార్లు భక్తుల నుంచి పూజలు అందుకునేందుకు సిద్ధమయ్యారు.

## అమెరికన్ డైమండ్స్‌తో గణనాథుడు

### సందర్శకులకు బహుమతులు కూడా

చిలకలూరిపేట, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో గోల్డెన్ యూత్ షరాఫ్ బజార్ వారి ఆధ్వర్యంలో 50 లక్షల అమెరికన్ డైమండ్స్ తో సుమారు రూ.10 లక్షల వ్యయంతో సర్వాంగ సుందరంగా గణనాథుని విగ్రహాన్ని వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధం చేశారు. సుమారు 11 అడుగుల ఎత్తున హైదరాబాద్, కలకత్తా, తంజావూరు శిల్పులతో తయారు చేసిన విగ్రహాన్ని 15 రోజుల పాటు 9 మంది నైపుణ్యం గల కళాకారులు తీర్చిదిద్దారు. 30వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి పందిరిని సందర్శించే భక్తులకు బహుమతులు కూడా ఇస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ప్రథమ బహుమతిగా మారుతి ఆల్టో కారు, ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రికల్ బైకు, తృతీయ బహుమతిగా సాంసంగ్ ఫ్రిడ్జ్ అందచేస్తామని తెలిపారు. షరాఫ్ మర్చంట్స్, స్వర్ణకార సంఘం, మెయిన్ బజార్ వర్తక సంఘం వారి సహాయ సహకారాలతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కన్వీనర్ పొట్టి వెంకటశివరత్నబాబు తెలి పారు.


రేపల్లె : పాతపట్నంలో సిద్ధం చేసిన వినాయక విగ్రహం

గుంటూరు : యంగ్‌వన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు

నరసరావుపేట : క్లాత్ మార్కెట్ మండపంలోని భారీ గణపతి విగ్రహం

## విద్యార్థి భవిష్యత్తుని ప్రశ్నార్థకం చేసిని ఇసుక లారీ

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆ విద్యా ర్థి తల్లిదండ్రులది చిన్న టిఫిన్ సెంటర్. వాళ్ల పడుతున్న కష్టం చూస్తూ పెద్దయ్యాక కాలు కింద పెట్టకుండా చూసుకోవాలన్న తాపత్రయంతో కష్టప డి చదువుతూ చదువులో విశేష ప్రతిభ కనబరు స్తున్నాడు. తమ కలలు, ఆశలన్నీ కుమారుడి పైనే పెట్టుకొని జీవనం సాగిస్తున్న ఆ తల్లిదండ్రులు గుండెపగిలిపోయే సమాచారం వినాల్సి వచ్చింది. పాఠశాలకు వెళ్లి ఇంటికి వస్తున్న తమ కుమారుడిని ఇసుక లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారని తెలియడంతో ఆ క్షణం నుంచి వాళ్ల పడుతున్న బాధ వర్ణనాతీతం. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుమారుడిని ఆస్పత్రిలో చేర్పించగా ఒక కాలుని పూర్తిగా తొలగించాలని వైద్యులు చెప్పడంతో గుండె ఆగినంత పని అయింది. అయినప్పటికీ మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో అంగీకరించి తనయుడికి వైద్యం చేయిస్తున్నారు. సోమవారం రాత్రి గుంటూరు శివారు గోరంట్లలోని పంచాయతీ ఆఫీసు రోడ్డులో స్కూలు నుంచి ఇంటికి వెళుతున్న తాడేపల్లి మోహన్‌సాయి శ్రీ చరణ్‌ని ఇసుక లారీ మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొన్నది. ఆ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని విద్యార్థి తండ్రి శ్రీనివాస్ ఆరోపించారు. ప్రమాదంలో తమ కుమారుడి ఎడమ కాలుని పూర్తిగా తొలగించారని, దాంతో 14 ఏళ్ల వయస్సులోనే దివ్యాంగుడిగా మారా డన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తున్న తమ కుటుంబం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని శ్రీనివాస్ గుండెలవిసేలా విలపిస్తున్నారు. కుమారుడి వైద్యఖర్చులకు కూడా భరించలేని స్థితిలో ఉన్న శ్రీనివాస్ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు శ్రీనివాస్ ఫోన్ నంబరు 63048 05670 సంప్రదించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్ సాయి శ్రీచరణ్

## ఉపాధి అవినీతిమయం

### ప్రజావేదికలో వెలుగుచూసిన అక్రమాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోనే లేని వారు పనులు చేసినట్లు, మస్టర్ లేకుండానే నగదు డ్రా, పొంతన లేని సంతకాలు, రికార్డుల్లో కొట్టివేతలు, పేర్ల దిద్దట్లు, కొలతల్లో తేడా, ఒకే పని రెండు మూడు గ్రామాల్లో చేసినట్లు చూపడం.. తదితరాలతో ఉపాధి పనులు అవినీతిమయంగా మారాయి. డ్వామా పీడీ శివశంకర్ అధ్యక్షతన ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి అక్రమాలు


టీఏ వలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ శివశంకర్

అనేకం వెలుగుచూశాయి. గ్రామాల వారీగా ఆడిట్ బృందం చేసిన సామాజిక తనిఖీ వివరాలను చదివి వినిపించారు. దాదాపు అన్ని గ్రామాలలో అవినీతి జరిగినట్లు తేటతెల్లమైంది. ఈ అక్రమాల్లో టెక్నికల్ అసిస్టెంట్ల పాత్ర అధికంగా ఉందని తేల్చారు. పాతమల్లాయపాలెంలో నివాసం ఉండని కుటుంబాలు నెలల తరబడి పనులకు వచ్చినట్లు చూపి రూ.లక్షలు దండుకున్నారు. ఒకే ఇంటిలో వేర్వేరుగా ముగ్గురికి జాబ్ కార్డులు ఇచ్చినట్లు తేలింది. విద్యార్థికి జాబ్ కార్డు ఇచ్చినట్లు ఆడిట్ బృందం స్పష్టం చేసింది. ప్రత్తిపాడులో చేసిన పనికి తిక్కిరెడ్డిపాలెం పంచాయతీలో కూడా చేసినట్లు చూపి డబ్బులు డ్రా చేశారు. మరి కొన్ని గ్రామాలలో కూడా జరిగాయి. కొన్ని పనులకు సంబంధించి పీడీ విచారణకు ఆదేశించారు.

### పీడీ ఎదుట సిబ్బంది వాదులాట

ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలో జరిగిన పని విషయంలో పీడీ ఎదుటే సిబ్బంది ఆడిట్ బృందంతో వాదులాటకు దిగారు. మీరు రండి పని చూపిస్తామని ఆడిట్ బృందం సభ్యులు అన్నారు. ఒకానొక దశలో పీడీతోనూ టీఏలు వాదనకు దిగారు. ఉద్యోగం చేయాలంటే బుద్ధిగా చేయాలని, టెక్నికల్‌గా మీరు చేయాల్సిన పని చేయకుండా ఇక్కడ వాదనలు ఏమిటంటూ పీడీ వారిపై మండిపడ్డారు. హరికథలు చెప్పవద్దని టీఏ వలిని మందలించారు. ఉపాధిహామీలో ఇంత దారుణమైన తప్పులు నేను చూడలేదంటూ పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి పనులను ప్రత్యేకంగా పరిశీలించాలని ఎంపీడీవో శివపార్వతికి పీడీ సూచించారు. వచ్చే ఏడాది జరిగే సోషల్ ఆడిట్‌లో తప్పులు దొరికితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## దివ్యాంగుల దీనగాథ

### పింఛన్లు కోల్పోయిన అర్హులు
### శాపంగా మారిన సదరం పునఃపరిశీలన
### తీవ్ర వైకల్యం ఉన్నవారికీ తప్పని అనర్హత వేటు

-(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

- **గుంటూరుకు చెందిన పూర్తి వైకల్యంతో ఉన్న కేతావత్ సక్రూనా యక్ పూర్తి వైకల్యంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. గత ప్రభుత్వంలో అతడికి 90 శాతం వైకల్యం ఉందని తేలింది. తాజా సర్వేలో 40 శాతం కూడా వైకల్యం లేనట్లు తేల్చి పింఛను ఆపేశారు. రెండు కాళ్లూ పనిచేయని ఆ దివ్యాంగుడు రోడ్డున పడ్డాడు.**
- **పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన కొమరాల రూఫస్ పుట్టుకతోనే మనో వైకల్యం ఉంది. అయితే అధికారుల బృం దం తాజా పరిశీలనలో 35 శాతంలోపు వైకల్యం ఉన్నట్లు తేల్చి పింఛను ఆపేసింది.**

ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పింఛను కోల్పోయి బతుకుకు భరోసా లేకుండా పోయిన అభాగ్యులు వందల్లో ఉన్నారు. వచ్చే నెల నుంచి పింఛను ఆగిపోతుందన్న వార్త వారిని తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. దీంతో వారంతా సంబంధిత అధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అనర్హులు అనేకమంది తప్పుడు ధృవపత్రాలతో దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వారిని తొలగించడం కోసం దివ్యాంగుల వైకల్య స్థాయిని పునః పరిశీలన చేపట్టింది. అయితే ఇది అర్హులైన ఎందరో దివ్యాంగులకు ఊహించని శాపంగా పరిణమించింది. అక్రమంగా పింఛన్లు పొందుతున్న అనర్హులను ఏరివేయడం పేరుతో మొదలైన ఈ ప్రక్రియ అనేక మంది అర్హులు కూడా అనర్హత బారిన పడ్డారు.


పింఛను రద్దు చేశారని చెబుతున్న బాధితుడు సక్రూనాయక్

### ఎనిమిది నెలల పరిశీలన అబాసుపాలు

దివ్యాంగ పింఛన్లలో అనర్హులను ఏరివేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది నెలలపాటు కసరత్తు చేసింది. అందుకోసం ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్, సంబంధిత ఏరియా వైద్య అధికారి సభ్యులుగా, వీరికి సహాయకుడిగా ఒక డిజిటల్ అసిస్టెంటుతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దివ్యాంగుల వైకల్యాన్ని పరీక్షించింది. ఈ బృందం ఇచ్చిన సదరం సర్టిఫికెట్లలో భారీగా తప్పులు వెలుగుచూస్తు న్నాయి. అర్హుల తొలగింపు విషయంలో ఆయా బాధితుల నుంచే కాకుండా చుట్టుపక్కల వారి నుంచి కూడా అసహనం వ్యక్తమవుతోంది.

### దిద్దుబాటు చర్యల్లో ప్రభుత్వం?

దివ్యాంగ పింఛన్ల తొలగింపు విషయంలో వెల్లువెత్తుతున్న జనాగ్రహాన్ని కూటమి ప్రభుత్వం గ్రహించినట్లుగానే కనిపిస్తోంది. సెప్టెంబరు నుంచి పింఛన్లు ఆపేయాలని తొలుత అధికారులకు ఆదేశా లు జారీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఒక అడు గు వెనక్కి వేసినట్లు తెలుస్తోంది. సెప్టెంబరు పింఛను ఆపకుండా యథావిధిగా అందించా లని సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఇది సెప్టెంబరు నెలకే వర్తిస్తుందా.. తిరిగి పునఃపరిశీలన ప్రక్రియ కొనసాగించే వరకూ కొన సాగుతుందా అన్నది కాలమే తేల్చాలి.

### వైకల్యం లేదని తేల్చారు..

నాకు రెండు చేతులు పనిచేయవు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 64 శాతం వైకల్యం ఉన్నట్లుగా గుర్తించి సదరం సర్టిఫికెట్ ఇచ్చింది. ఆ సర్టిఫికెట్ ఆధారంగా రూ.6 వేలు పింఛను వస్తోంది. ఇప్పుడు 30 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని చెప్పి పింఛను ఆపేశారు.

-కసినబోయిన రాజేశ్, నల్లపాడు రోడ్డు, గుంటూరు



## రాజధాని గ్రామాలకు మహర్దశ

### మౌలిక సదుపాయాల కల్పనకు రూ 904 కోట్లు
### డాక్యుమెంట్లలో అసైన్డ్ పదం తొలగింపు
### బాబు నిర్ణయంతో ఆరువేల మంది రైతులకు లబ్ధి

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి గ్రామాలకు మహర్దశ కలుగనుంది. రాజధాని గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలన్న అమరావతి జేఏసీ ప్రతినిధుల కోరికను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. రాజధానిలో ప్రస్తుతం వున్న 29 గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సీఆర్‌డీఏ నిధులు రూ. 904 కోట్లను మంజూరు చేసేందుకు 51వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. దీంతోపాటు రాజధానిలో భూసమీకరణకు ఇచ్చిన అసైన్డ్‌భూముల తాలూకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు డాక్యుమెంట్లలో అసైన్డ్ అనే పదాన్ని తొలగించాలన్న అమరావతి జేఏసీ డిమాండ్‌పై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఇక మీదట అసైన్డ్ భూములకు సంబంధించిన రిటర్నబుల్ డాక్యుమెంట్లలో అసైన్డ్ అనే పదాన్ని తొలగించాలని కూడ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయించారు. ఈ రెండు కీలక నిర్ణయాలతో రాజధాని ప్రాంత రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

రాజధాని అమరావతిలో నగర నిర్మాణం కోసం రూ వేలకోట్ల నిధులను ఖర్చు చేస్తున్నప్పటికీ...రాజధానిలో ఇప్పటికే వున్న 29 గ్రామాలలో ఎటువంటి అభివృద్ధి పనులను చేపట్టడం లేదని రాజధాని రైతులు గత కొంతకాలంగా ఆవేదన చెందుతున్నారు. గత పీరియడ్‌లో అంటే 2019కు ముందు తుళ్లూరులోనూ, వెంకటపాలెంలోనూ చెరువులను సుందరీకరించి బాగా అభివృద్ధి చేశారు. అలాగే వెంకటపాలెం ఊళ్లో నుంచి తుళ్లూరు-మంగళగిరి ఆర్‌అండ్‌బీ రహదారి వరకు వున్న రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కలతో అందంగా అభివృద్ధి చేశారు. ఈ దఫా అంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 15 మాసాల్లో గతంలో మాదిరి రాజధాని గ్రామాల్లో ఏతరహా అభివృద్ధి పనులను చేపట్టలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న దాదాపు 12, 13 రకాల సమస్యలను గత కొన్నాళ్లుగా అమరావతి జేఏసీ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూ వచ్చింది. అందులో భాగంగా పది రోజుల క్రితం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో పురపాలకశాఖమంత్రి పి నారాయణ సమక్షంలో సీఆర్‌డీఏ అధికారులతో అమరావతి జేఏసీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయా అంశాలను లేవనెత్తారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు గ్రీన్‌సిగ్నల్‌ను ఇచ్చారు. దీంతో రూ. 904 కోట్లను యుద్ధప్రాతిపదికన విడుదల చేసేందుకు సీఆర్‌డీఏ నిర్ణయించింది.

రాజధానిలోని 29 గ్రామాలలో మౌలిక సదుపాయాల కోసం మంజూరు చేసిన రూ. 904 కోట్లకు టెండర్లను పిలిచి సంబంధిత పనులన్నింటిని ప్రారంభిస్తారు. ఈ నిధుల్లో తాగునీటి పథకాల కోసం రూ. 64.35 కోట్లు, రాజధాని గ్రామాల్లో ఆల్రెడీ వున్న రహదారుల అభివృద్ధికి రూ. 339.04 కోట్లు, మురుగునీటి శుద్ధిచేసే ప్లాంట్ల ఏర్పాటు నిమిత్తం రూ. 110.72 కోట్లు, వీధి దీపాల ఏర్పాటు కోసం రూ. 12.25 కోట్లను ఖర్చు చేయనున్నారు. మిగిలిన రూ. 377.64 కోట్లను వివిధ రకాల టాక్స్ చెల్లింపులు, ఏడెళ్లపాటు సంబంధిత అభివృద్ధి పనులను నిర్వహించేందుకుగాను వినియోగిస్తారు. వీటితోపాటు రాజధాని అమరావతిలో ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులకు తోడు... రాజధానిలో వినియోగిస్తున్న నీటిని శుద్ధి చేసేందుకు కొత్తగా నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఇందుకుగాను రూ. 787.59 కోట్లను కేటాయిస్తూ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ నిధుల్లో మొదటి దశ ప్యాకేజి కింద రూ. 411 కోట్లు, రెండో దశ ప్యాకేజి కింద రూ. 376.59 కోట్లను ఖర్చు చేసేలా ప్రణాళికను రూపొందించారు.

ప్రత్యేకించి రాజధాని అమరావతిలో సుమారు నాలుగున్నర వేల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములను రైతులు భూ సమీకరణకింద సీఆర్‌డీఏకు ఇచ్చారు. అయితే వీటికి ప్రభుత్వం పట్టా భూములకన్నా కొంత తక్కువ ప్యాకేజిని ఇస్తుంది. భూసమీకరణ కింద తీసుకున్న పట్టా, అసైన్డ్ భూములు అయినా...ప్రభుత్వం తిరిగి ఆయా రైతులకిచ్చే రిటర్నబుల్ ప్లాట్ల స్వభావం మాత్రం అందరికీ ఒకేరీతిగా వుంటుంది. కానీ, అసైన్డ్ భూములకు సంబంధించి ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల తాలూకు డాక్యుమెంట్లలో అసైన్డ్ అనే పదాన్ని ఉదహరిస్తున్న కారణంగా కొనుగోలుదారులు ఆయా ప్లాట్లను తక్కువ ధరలకు అడుగుతున్నారు. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని అసైన్డ్ రైతులు చాలా కాలంగా ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను పలు దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి డాక్యుమెంట్లలో అసైన్డ్ అనే పదాన్ని ఉపసంహరించుకునేలా నిర్ణయాన్ని వెలువరించారు. దీంతో సుమారు ఆరు వేలమంది వరకు వున్న అసైన్డ్ రైతులకు లాభం చేకూరనుంది.


రాయపూడిలో కృష్ణానది ఒడ్డున రూ.ఐదు కోట్లతో నిర్మించిన కృష్ణా జలాలను శుద్ధి చేసే ఫిల్టర్ హౌస్


తుళ్లూరులో 2018లో అభివృద్ధి చేసిన చెరువు

## అవీ..ఇవీ..

### రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనుల వద్ద పరిశీలిస్తున్న జేసీ గంగాధర్‌గౌడ్

అద్దంకి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం సందర్భంగా పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ మంగళవారం సాయంత్రం పనులను పరిశీలించారు. ప్రధానంగా అద్దంకి, పంగులూరు మండలాలలో పలు చోట్ల భూమి కోల్పోయిన రైతులకు ఇంకా పరిహారం అందకపోవడం, పలు గ్రామాల వద్ద రైతుల అవసరాలకు అనుగుణంగా వంతెనలు, నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల రైతులు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. దీంతో ఆయా సమస్యలను మంగళవారం సాయంత్రం రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రైతులు తమ సమస్యలను వివరించారు. అద్దంకి, పంగులూరు తహసీల్దార్లు శ్రీచరణ్, శింగారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### వినాయకుని విగ్రహాల పంపిణీ



మార్టూరులో రాయల్ స్కూల్‌లో వినాయకుని ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మార్టూరు : వినాయకచవితి పర్వదినం సందర్భంగా మంగళవారం మార్టూరు రాయల్ స్కూల్‌లో విద్యార్థులకు స్కూలు యాజమాన్యం మట్టితో తయారుచేసిన వినాయకుని విగ్రహాలను పంపిణీ చేసింది. అంతేగాకుండా బాలబాలికలు వినాయకుని ప్రతిమ ఆకారంలో కూర్చొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పేరం రవీంద్రబాబు, ఇన్‌చార్జ్ కే.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

### నెలాఖరులోగా కుట్టు శిక్షణను పూర్తి చేయాలి

ఒంగోలునగరం, ఆగస్టు 26(ఆం ధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మహి ళల కుట్టు శిక్షణను ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. మం గళవారం ఆయన ఒంగోలులోని బాలా జీనగర్‌లో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మహిళలు నేర్చుకున్న శిక్షణ వారి జీవనోపాధికి ఉ పయోగం పడేలా ఉండాలన్నారు. మ హిళలు మాట్లాడుతూ ఈ శిక్షణ తమ కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దని ఈడీకి తెలిపారు. రకరకాల దుస్తు లు ఏ విధంగా కుట్టాలి, ప్రత్యేకించి మ హిళలు, చిన్న పిల్లల దుస్తులు కుట్టుపై పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

### పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆం ధ్రజ్యోతి) : లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌వీ.రాఘవ, సీహెచ్.శ్రీనుబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్ళ నుంచి హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తూ వస్తున్నామని చెప్పారు. అనంతరం మట్టివినాయక ప్ర తిమలు, కథ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యు లు నాగరాజు పాల్గొన్నారు.

### సబ్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న దేవకుమార్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. ఒంగోలులోని ఎంసీపీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎస్‌ఓపీని క్షుణ్ణంగా అర్థం చేసుకుని దళిత గిరిజనుల సంఘ నాయకులు పనిచేయాలని తెలిపారు. సబ్ ప్లాన్ నిధుల ద్వారా దళిత, గిరిజనుల నివాస ప్రాంతాలు, కుటుంబం, వ్యక్తి అభివృద్ధికి కృషి చేయాలని చట్టం చెబుతుందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ సిటిజన్ ఆడిట్ నివేదిక ప్రకారం, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల అత్యాచారాల నివారణకు ఈ చట్టం వచ్చిందని చెప్పారు. సమావేశంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళ కో ఆర్డినేటర్ ఎం. హేమలత, బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ గురజాల రాజేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### టీచర్లకు ఉద్యోగోన్నతి పత్రాల అందజేత

ఒంగోలు విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ మంగళవారం స్థానిక సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఆరుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. డీఈవో కిరణ్ కుమార్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

### బార్ లైసెన్సు.. సైలెన్స్

(7వ పేజీ తరువాయి)

ఈ నెల 29 వరకు గడువు పెంచింది. అప్పటికీ దరఖాస్తుల విషయంలో ఇదే రీతిలో స్పందన ఉంటే తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

- గుంటూరు జిల్లాలో 110 బార్లు ఉండగా కేవలం 18 బార్లకు మాత్రమే 47 దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఆరు బార్లకు నాలుగు, మంగళగిరిలో మూడు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి.
- పల్నాడు జిల్లాలో 49 బార్లలో 9 బార్లకు మాత్రమే 22 దరఖాస్తు వచ్చాయి. సత్తెనపల్లిలో మూడు బార్లకు 10, దాచేపల్లి, గురజాలలో ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. చిలకలూరిపేటలోని 10, పిడుగురాళ్లలో 6, మాచర్లలోని 4, వినుకొండలోని 6 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 17 బార్లకు నాలుగు బార్లకు మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి.

# కొనుగోళ్లు లేక గుమ్మడి రైతులు లబోదిబో

- కిలో రూ.20 నుంచి రూ.5కు పడిపోయిన ధర
- ఖర్చులు కూడా చేతికి అందే పరిస్థితి లేదంటున్న రైతులు



బల్లికురవలో రైతులు సాగు చేసిన గుమ్మడి తోట

బల్లికురవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆశతో గుమ్మడి పంట సాగు చేసిన రైతులు కొనుగోళ్లు లేక లబోదిబోమంటున్నారు. గతంలో ఆశాజనకంగా ఉన్న గుమ్మడి ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో రైతులు పెట్టుబడికూడా వచ్చే పరిస్థితి లేదని లబోదిబో మంటున్నారు. ధరలు తగ్గడమే కాక కాయాలను కూడా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎవరు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు హైదరాబాద్ మార్కెట్‌కు అయిన కాయాలను తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తామని వాహనాలను ఏర్పాటు చేసుకొని వెళుతున్నారు.





ట్రాక్టర్‌లో తరలిస్తున్న గుమ్మడికాయలు, హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాయలు

బల్లికురవ మండలంలోని బల్లికురవ, నక్కబొక్కల పాడు, కొత్తపాలెం, కొప్పెరపాలెం, గంగపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి, రామాంజనేయపురం, ఎస్ ఎల్ గుడిపాడు, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో పలువురు రైతులు ఎర్ర గుమ్మడి తోటలను సాగు చేశారు. ఎకరాకు రూ. 25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట దిగుబడులు మాత్రం అంతంత మాత్రంగా వచ్చాయి. ఎకరాలకు 3 నుండి 4 టన్నుల వరకు గుమ్మడి దిగుబడులు వచ్చాయి. ధర మాత్రం అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు బెంబేలేత్తి పోతున్నారు. ఎంతో ఆశతో సాగు చేశామని ధరలు తమను నష్టాల ఊబిలోనికి నెడుతున్నాయని రైతులు అంటున్నారు. పలు ప్రాంతాలలో ఎక్కువ మంది రైతులు గుమ్మడి సాగు చేయడంతో మార్కెట్‌కు పెద్ద ఎత్తున కాయలు వస్తున్నాయని అందువలనే ధరలు తగ్గాయని రైతులు వాపోతున్నారు. గత నెలలో కిలో రూ.20 వరకు ఉందని ఇప్పుడు రైతుల వద్ద గుమ్మడి కాయలు దిగుబడులు వచ్చే సరికి మెదట్లో కిలో రూ. 10 ఉండగా ఇప్పుడు రూ.6 కే కొనుగోలు చేస్తామని అంటున్నారని రైతులు తెలిపారు. ధర లేకపోవడంతో కొంత మంది రైతులు కాయకోయకుండానే వదిలేస్తున్నారు. ఈ ఏడాది గుమ్మడి నష్టాలను మిగిలిస్తోందని రైతులు వాపోతున్నారు.

# వాహనచోదకులకు పొంచి ఉన్న ప్రమాదం

భారీ వాహనాలతో పగిలిన కల్వర్టు

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో రేణింగవరం రోడ్డులోని కల్వర్టు పగిలిపోయింది. దీంతో వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. కాకానిపాలెం వైపు నుంచి వచ్చే మురుగు నీరు దామావారిపాలెం వద్ద ఉన్న మెయిన్ డ్రైన్‌లో కలిసే విధంగా భవానిసెంటర్‌లో రేణింగవరం రోడ్డుకు కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టుపై నిత్యం వందల టిప్పర్లు గ్రావెల్ విజయవాడ-బెంగళూరు రోడ్డుకు తరలిపోతుండడంతో కల్వర్ట పగలింది. దీంతో



కల్వర్ట్‌పై వెళుతున్న భారీ వాహనం, గోతికి అడ్డుగా పెట్టిన పోస్టులు (ఇన్‌సెట్)

గోతిలో కర్ర ఉంచి చుట్టూ దిమ్మెలు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వెంటనే కల్వర్టుకు పడ్డ గొయ్యి పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

### పంక్చర్ షాపు వద్ద యువకులు హల్‌చల్

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో యువకులు పంక్చర్ దుకాణం వద్ద హల్‌చల్ చేశారు. అద్దంకి పట్టణంలోని పోతురాజుగండి వద్ద ఉన్న పంక్చర్ దుకాణం వద్దకు మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు స్కూటీ తీసుకొచ్చి పంక్చర్ వేయించుకున్నారు. పంక్చర్ వేసినందుకు డబ్బులు అడగడంతో మద్యం మత్తులో ఉన్న యువకులు గొడవపడి హల్‌చల్ చేశారు. దీంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.



యువకులను పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్తున్న పోలీసులు

### రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం : మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సూచించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మంగళవారం రైల్వేశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలతో పాటు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ పనుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వాటిని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఈ శంకరరావు, ఆర్‌పీఎస్ ఎల్‌సైట్ ఇంజనీర్ రాధాకృష్ణ, ఆర్‌ఎస్పీ సుందర్‌సింగ్, డీఆర్ రవికుమార్, డీఆర్‌యూసీ సభ్యులు నాదెండ్ల మనోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతకు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే ఎంపీ మాగుంటను రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ చైర్మన్ బోడపాటి తేజస్వీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాంస్కృతికంగా ఒంగోలును అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

### 'యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు..'

కొండపి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు, ఏవో మాల్యా ద్రి ఎరువుల డీలర్లను హెచ్చరించారు. మంగళవారం కొండపి లోని పలు ఎరువుల దుకాణాలను అధికారులు పరిశీలించా రు. ఎరువుల స్టాక్‌ను, రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు ఎ రువులు కొనుగోలు చేసినపుడు తగిన రశీదులు తీసుకోవాలని, డీలర్లు ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని సూచించారు. ఎన్‌ఫో ర్స్‌మెంట్ అధికారులు తనిఖీలో పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో

మద్దిపాడు: యూనియాను ఎరువులు అధిక ధరకు విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవోస్వర్ణలత హెచ్చరించారు. వెల్లంపల్లిలోని పురుగుమందుల షాపును ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో కలిసి ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలిం చారు. కార్యక్రమంలో అధికారులు రమణయ్య, ఎన్‌ఫోర్స్‌మెం ట్ సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణ హిత విగ్రహం



ఒంగోలు మండలం మండవవారిపాలెంలో వినాయకచవితిని పురస్కరించుకు ని గ్రామానికి చెందిన సీహెచ్.రామయ్య మట్టితో భారీ వినాయక విగ్రహాన్ని రూ పొందించారు. ఇందుకోసం ఆయన సు మారు ఆరురోజుల పాటి కష్టపడి రూపొందించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం కోసం లోపలి భాగం వరిగడ్డి వాడినట్లు తెలి పారు. అలాగే ఏడు బస్తాల నల్లరేగడి మట్టి పూతతో వినాయక విగ్రహం త యారు చేసినట్లు చెప్పారు. దీనివల్ల ఎలాంటి పర్యావరణ కాలుష్యం ఉండ దన్నారు. ఈ గణేషుడి విగ్రహాన్ని గ్రామస్థులు గ్రామలోని శ్రీకోదండరామ స్వా మివారి దేవాలయంలో చవితి పూజా కార్యక్రమాలకు ఏర్పాటు చేసినట్లు పేర్కొ న్నారు. ఈ విగ్రహాన్ని తిలకించేందుకు స్థానికులు ఉత్సాహం చూపుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

### మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన



మట్టితో తయారు చేసిన విగ్రహాలతో విద్యార్థులు

చీమకుర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహా గణపతి అని, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలంటూ పల్లామల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థులు అందరికీ అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని పర్యావరణ హితం కోసం విద్యార్థులు హెచ్‌ఎం జీఎ స్‌ఆర్.సాయి పర్యవేక్షణలో మంగళవారం పాఠశాలలో మట్టి గణపతి ప్రతిమలను తయారుచేశారు. మట్టి విగ్రహాలకే పూజలు చేస్తామంటూ ప్రతిన పూనారు.

### పండుగను ప్రశాంతంగా చేసుకోవాలి

యద్దనపూడి,(మార్టూరు)ఆగ స్టు26(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను జాగ్రత్తగా, ప్రశాంతంగా, ఎలాంటి గొడవలు చేసుకోకుండా జరుపుకోవాలని పర్చూరు సీఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లో మండలంలో వినాయకుని బొ మ్మలను ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులతో పోలీసులు సమావేశం ఏర్పాటుచేశారు. .ఈ సందర్భంగా వారితో సీఐ మాట్లాడుతూ విగ్రహాలను మండపానికి తీసుకువస్తున్న సమయంలో, యువకలు ఊరేగింపుగా,వచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా మండపాలు వద్ద ఏమైనా గొడవలు జరిగితే నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు.అనంతరం వారందరికి పండుగ శుభాకాంక్షలను తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ టిరత్నకుమారి,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థుల వార్షికోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్, స్టాఫ్ నర్సుల అసోసియేషన్ 5వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కే శరత్‌బాబు, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు ఉదయలక్ష్మి, జనరల్ సెక్రటరీ కొత్తపల్లి మంజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడం సేవగా భావించాలన్నారు. విధుల నిర్వహణలో ఐక్యతతో మెలగాలని, సంఘం మరింత బలోపేతం అయి, హక్కులు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సుమన్, జోయెల్, నర్సింగ్ సిబ్బందిపాల్గొన్నారు.





వేడుకలలో పాల్గొన్న నర్సులు

### పంచాయతీల అభివృద్ధి ద్వారానే గ్రేడ్‌లు

అద్దంకిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉన్న వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి చేయడం ద్వారానే గ్రేడ్‌లు కేటాయించినట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక 2.0పై మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి 9 అంశాల ద్వారా 164 సూచికలతో కొలుస్తారన్నారు. వీటి ఆధారంగానే గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్‌లు ఇస్తారన్నారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కోటేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ధర రూ. 266.. అమ్ముతోంది రూ.300

- కొత్తపట్నంలో యూరియా విక్రయాల్లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- జేసీ తనిఖీల్లో బహిర్గతం
- కేసు నమోదు చేసిన అధికారులు

కొత్తపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : సాగు సమయం ఆసన్నమైంది.. రైతులు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు.. ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి సమయంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు నిలువుదోపిడీకి దిగుతున్నారు. ఎరువులు పురుగుమందుల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యమైంది. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జేసీ గోపాలకృష్ణ నేరుగా రంగంలోకి దిగారు. మంగళవారం కొత్తపట్నంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో వ్యాపారుల అసలు గుట్టురట్టయ్యింది. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.300కు అమ్ముతున్నారు. కొత్తపట్నంలోని శివాలయం వీధిలో ఉన్న షా ఎంటర్‌ప్రైజెస్ దుకాణాన్ని జేసీ తనిఖీ చేశారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యూరియా బస్తా ఎంతకు అమ్ముతున్నారంటూ వాకబు చేశారు. రూ.300లకు విక్రయిస్తున్నారని చెప్పటంతో షా ఎంటర్‌ప్రయిజెస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అంతేగాక దుకాణంలో ఉన్న 4.86 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేశారు. అనంతరం ఆయన రాజుపాలెం లోని బాలాజీ ఏజెన్సీస్‌లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఆ ప్రాంతం లోని రైతులతో కూడా జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు తదితరులు ఉన్నారు.





రైతుతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

### యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

వ్యవసాయాధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగులో ఉన్న పంటలకు అవసరమైన ఎరువులు, యూరియా రైతులకు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా యూరియ కొరత ఏర్పడకుండా రైతులకు అవసరమైన మేరకు ఎరువులను వెంటనే అందచేయాలని, కేటాయించిన యూరియా పూర్తిగా స్థానిక రైతులకు అందేలా చూడాలని అన్నారు. ఎరువులు బయటకు మళ్లించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

### సామాన్యుడిలా ఉండడం ఇష్టం

- సినీ నటుడు అజయ్‌ఘోష్

నాగులుప్పలపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడిలా ఉండ టం ఇష్టమని సినీ నటుడు అజయ్ ఘోష్ చెప్పారు. ఒంగోలు నుంచి తన స్వగ్రామం వేటపాలెనికి స్కూటీపై వెళ తున్న నటుడు అజయ్ ఘోష్ మంగళవారం నాగులుప్పలపాడులోని ఓ టీ దుకాణం వద్ద ఆగారు. దాంతో స్థానికులు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా అంటే వినోదం కాదని సమాజానికి సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. అలాంటి చిత్రాలు ఎన్నో నటించడం వల్లనే తనకు ఇంత గుర్తింపు లభించిందన్నారు. ఒకప్పుడు థియేటర్లలో విజిల్స్ కొట్టిన తాను ఇప్పుడు వారితోనే నటించడం గర్వంగా ఉందని చెప్పారు. పక్కా కమర్షియల్, రంగస్థలం, పుష్ప లాంటి సినిమాలతో ప్రేక్షకులను ఎంతగానో ఆదరించారన్నారు. ఇప్పటికీ తాను అందరితో కలసి సరదాగా ఉండటం షూటింగ్ లేని సమయంలో స్నేహితులు, బంధువులతో సామాన్యుడిగా మెలగడం ఎంతో ఇష్టమన్నారు.



అజయ్ ఘోష్‌తో స్థానికుడు

## అవీ..ఇవీ..

### కుందేరు ప్రక్షాళనకు సన్నద్ధం

- ఆక్రమణలపై ఇప్పటికే అంచనా
- త్వరలో పరిశీలన..అనంతరం చర్యలు
- అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కుందేరు ఆక్రమణల ప్రక్షాళనపై పాలకులు, అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు సంబంధించి కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ తగు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కుందేరు వాగు బాపట్ల మండలంలో 97.20 ఎకరాలు, చీరాల మండలంలో 276.72 ఎకరాలు, వేటపాలెంలో 656.06, చినగంజాంలో 452.98 ఎకరాలు విస్తీర్ణంలో సహజ సిద్ధంగా విస్తరించింది. తద్వారా తుఫాన్, వరదలతో పాటు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కవచంలా ప్రయోజకరంగా ఉంది. అయితే కాలక్రమేణ వాగు ఆక్రమణలతో బక్కచిక్కింది. ఒక్క చీరాల డివిజన్ పరిధిలోనే సుమారు 143 అనధికార నివాసాలు ఏర్పడ్డాయి. కబ్జా కోరల్లో ఉన్న కుందేరును అభివృద్ధి పరచి భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరంగా ఉండేందుకు పాలకులు, అధికారులు కొంతకాలంగా సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి అంచనాకు వచ్చారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే కొండయ్య అధికారులతో సమీక్షించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందించి అంచనాకు రానున్నారు. త్వరలోనే ఆక్రమణలపై చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయండి**

చీరాల : నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్లమెంట్, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలపై మాట్లాడారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని వివరించారు. అంతకు ముందు పట్టణంలోని మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లో-వోల్టేజీ సమస్యకు పరిష్కారం

బల్లికురవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు అదికంగా ఉండే గ్రామాలలో లోవోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ అంజనేయులు తెలిపారు. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి ఎస్ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం మల్లాయపాలేనికి సబ్‌స్టేషన్ మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వభూమి 67 సెంట్లలో త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే గ్రానైట్ పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో లోపాలు ఉండవన్నారు. అలానే గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుంగా త్రిఫేజ్ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు పనులు ప్రారంభిసామన్నారు. ఈ పరిశీలనలో మార్టురు ఏడీఈఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### మహోన్నతమైన వ్యక్తి మదర్‌థెరిస్సా

అద్దంకిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అతిచిన్న వయస్సులోనే సేవారంగంలోకి వచ్చిన మహోన్నత వ్యక్తి మదర్ థెరిస్సా అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం సాయంత్రం రోటరీ కార్యాలయంలో థెరిస్సా 115వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ అలహరి హరిప్రసాద్, డాక్టర్ యు. దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి కోలాహలం

- పలుచోట్ల మట్టి ప్రతిమల పంపిణీ
- భాగస్వామ్యమైన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు
- పూజా సామగ్రికి డిమాండ్


చీరాలలోని మార్కెట్ సెంటర్‌లో పూజాసామగ్రి కోసం భక్తుల రద్దీ

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వినాయక చవితి కోలాహలం నెలకొంది. గణనాధుని ప్రతిమలు, ప్రతుల కోసం ప్రజలకు మార్కెట్ కూడలి కి రావడంతో ఆ ప్రాంతం అంతా రద్దీగా మారింది. చీరాల కూరగాయల మార్కెట్, క్లాత్‌మార్కెట్‌లతో పాటు, ఈపూరుపాలెం, వేటపాలెం గడియార స్తంభం కూడలిలో రద్దీ పెరిగింది. భక్తులు, చిన్నారులు, మహిళలు ఉదయం నుంచే వినాయకుని ప్రతిమలు, ప్రతులు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్దకు బారలు తీరారు.

**నిమజ్జనాలపై ప్రత్యేక దృష్టి సారించండి**

వినాయక నిమజ్జనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. మంగళవారం డీఎస్పీ ఎండీ మొయిన్‌తో కలిసి అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్, వాడరేవు, రామాపురం, కఠారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం తీర ప్రాంతాల్లో నిమజ్జనాలకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. విపత్కర పరిస్థితులలో వెంటనే ఆయా శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

చీరాల : ప్రతి ఒక్కరు మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని చీరాల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రూ.28వేల విలువైన 1500 మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. అందరూ ఆనందంగా పండుగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలిలో ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, అమర్‌చంద్, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సురేష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అద్దంకి : మండపాలలో కొలువుదీరేందుకు గణనాథులు తరలి వెళ్లారు. బుధవారం వినాయక చవితి నేపథ్యంలో వీధి వీధిన పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. అద్దంకిలోని తయారీ కేంద్రాల నుంచి సుమారు 300కు పైగా వినాయక విగ్రహాలను పట్టణంతో పాటు అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు, బల్లికురవ, సంతమాగులూరు, పంగులూరు, కొరిశపాడు తదితర మండలాలలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసేందుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా బుల్లి వినాయకులను తీసుకెళ్లారు. పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో పూజా సామగ్రి అమ్మకాలతో రద్దీ ఏర్పడింది. దీంతో సందడి నెలకొంది.

**మట్టి వినాయక ప్రతిమలనే ఉపయోగించండి**

అద్దంకిటౌన్ : ప్రకృతి కాలుష్యం, జలకాలుష్యం లేని మట్టివినాయక ప్రతిమలనే భక్తులందరూ ఉపయోగించాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా తమ కార్యాలయం వద్ద పట్టణ ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ అలహరి హరి ప్రసాద్, చిన్ని మురళీకృష్ణ, మహ్మమద్‌రఫీ, వీరయ్య, రామకోటేశ్వరరావు, అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**మట్టి విగ్రహాలతో బాలికల ప్రదర్శన**

వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థునులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పర్యవరణ కాలుష్యాన్ని నివారించేందుకు భక్తులు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పీడీ కృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**గణనాథుని మట్టి ప్రతిమల పంపిణీ**

పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ గంగా వద్ద మంగళవారం 650 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, నాగబైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయ భాస్కర్, వెంకన్న, కాసా అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు మట్టి విగ్రహాల పంపిణీ**

చినగంజాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వినాయక చవతి పండుగను పురస్కరించుకొని పాఠశాలలోని ఈకో క్లబ్, ఈగల్ క్లబ్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పర్యావరణానికి హాని లేని మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, మీ చుట్టుపక్కల వారు కూడా వాడేట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నరసింహా రావు, సుబ్బారావు, కోటిరెడ్డి, నాగేశ్వరరావు, రామ్ కుమార్, ఈకో క్లబ్ ఉపాధ్యాయులు ఉదయభానేశ్వరి, జ్యోతి, ఈగల్ క్లబ్ ఉపాధ్యాయులు ఏ.అరుణకుమారి, ప్రసాద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.






చిన్నగంజాంలో మట్టిప్రతిమలతో విద్యార్థులు, అద్దంకిలో బుజ్జి గణపయ్యను తీసుకెళుతున్న చిన్నారులు, అద్దంకిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంపిణీ

# మొక్కుబడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

- కోరం లేక మూడు గంటలు నిలిచిన సమావేశం
- సభ్యులకు ఫోన్ చేసి పిలిపించిన ఏఎంసీ చైర్మన్

సంతమాగులూరు ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశం 11 గంటలకు ఎంపీపీ ఏనుబర్ల ఎల్లమంద అధ్యక్షతన ప్రారంభం కాగా ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. అయితే ఎంపీడీవో జ్యోతిర్మయితో పాటు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తెలప్రోలు రమేష్ హాజరయ్యారు. అయితే సభ్యులు లేకపోవడంతో ఒకింత విస్మయానికి గురై సభ్యుల కోసం ఎదురు చూశారు. సమయం 12:30 అయ్యేసరికి అధికారికంగా సమావేశం ప్రారంభం కాగా, గంటన్నరకు అధ్యక్ష హోదాలో ఎంపీపీ ఉండగా మరో ముగ్గురు ఎంపీటీసీలు చవిటిపాలెం ఎంపీటీసీ సభ్యులు లీలావతి రాధాకృష్ణమూర్తి, సంత మాగులూరు సభ్యుడు పిట్టమడుసుల కాంతారావు, సజ్జాపురం ఎంపీటీసీ శ్రీనివాసరావుతో పాటు కో ఆప్షన్ సభ్యులు షైకంటి మస్తాన్‌వలి (ఉక్కు) సమావేశ మందిరంలోకి వచ్చారు, అయితే మండల పరిషత్ మొత్తం పాలకవర్గ సభ్యులు 17 మంది కాగా, కోఆప్షన్ సభ్యులతో కలిసి మొత్తం 18 మంది, సమావేశం కోరం ఉండాలంటే మూడో వంతు కంటే ఆరుగురు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి, ఆరవ సభ్యుడు ఎవరు రాకపోవడంతో అటు అధికారులతో పాటు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైన సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు తెలపోలు రమేష్ కాస్తంత విస్మయానికి గురయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన రమేష్ ఎంపీటీసీలకు సభ్యులకు ఫోన్ చేసి రావాల్సిందిగా కోరారు, మధ్యాహ్నం 1.30 వరకు సమావేశం జరుగుతుందా..? లేదా..? అన్న ఉత్కంఠ నడిచింది. పలువురు అధికారులు సైతం మౌనంగా అక్కడే ఎదురుచూస్తూ కనిపించారు. ఎట్టకేలకు ఎల్లల చెరువు ఎంపీటీసీ సభ్యురాలు సభ్యురాలు మేకల లక్ష్మి సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఆమెతో సంతకాలు చేయించుకుని, కోరం సరిపోవడంతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే మధ్యాహ్న భోజన సమయం మించిపోవడంతో ఎజెండాలు, చర్చలు, ప్రగతి నివేదికలు, ఏమీ లేకుండానే సమావేశాన్ని మమా అనిపించేశారు. సమావేశంలో ఎంపీపీ ఏనుబర్ల ఎలమంద, తహసీల్దార్ కే.రవిబాబు, నల్లూరి శివరాం ప్రసాద్, ఏడుగురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కోటయ్య



అద్దంకి,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): అద్దంకి కోర్టులో అదనపు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా బత్తుల రామకోటయ్యను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. సంతమాగులూరు మండలం పుట్టావారి పాలేనికి చెందిన బత్తుల రామకోటయ్య గత 25 సంవత్సరాలుగా అద్దంకిలో నివాసం ఉంటున్నారు. అద్దంకి, ఒంగోలు కోర్టులలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. బత్తుల రామకోటయ్య ప్రస్తుతం టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గా ఉన్నారు. అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ఏజీపీగా మూడేళ్ల పాటు సేవలందించనున్నారు. తనకు సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు రామకోటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## 46 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ వైద్యం చేయించుకున్న 46 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయ్యాయి. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం చిలకలూరిపేట లోని మంత్రి నివాసం లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## 75 గణేష్ విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తులు

బల్లికురవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవతి పండగ సందర్భంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు 75 మంది ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేశారని ఎస్ఐ వై. నాగరాజు తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ప్రభుత్వం విధించిన నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి విగ్రహం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాటకచేరీలు, డీజేలతో అసాంఘీక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. గణేష్ విగ్రహాలను నిర్వాహకులు గ్రామాలకు మంగళవారం ఉదయం నుంచే తరలించారు. సంబరాలతో గణనాథులను గ్రామాలలోకి అహ్వానించారు.

## బర్లీ పొగాకు సాగు చేయొద్దు

అద్దంకిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు బర్లీ పొగాకు సాగు చేయవద్దని ఏవో క్రొత్తపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు సాగును ప్రభుత్వం ఈ పంట కాలానికి నిషేధించినట్లు తెలిపారు. గ్రామంలో మినుములో పంటను పరిశీలించి రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడా క్లోప్రీడ్ మందును ఒక ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అంజిరెడ్డి, బోనిగల ఎలిశమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ మౌనిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులపై అసిస్టెంట్ మేనేజర్ వేధింపులు మానుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్మికులను వేధింపుకలకు గురి చేయడం మానుకోవాలని స్టాఫ్‌అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు అన్నారు. మంగళవారం అద్దంకి బస్టాండ్ ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ కలెక్షన్లు తక్కువగా వస్తున్నాయని కార్మికులను అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ వేధించడం రోజు పరిపాటిగా మారిందన్నారు. దీంతో కార్మికులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారన్నారు. అధికారులు ఇలాంటి వేధింపులు మానుకోవాలన్నారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న ఏడీసీ జయసింహారెడ్డికి ఒంగోలు బదిలీ అయితే రిలీవ్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని, వెంటనే ఏడీసీని రిలీవ్ చేయాన్నారు. డిపోలో ఉన్న సమస్యలను పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. 300 మంది కార్మికులు ఉన్న డిపోలో కనీసం మరుగుదొడ్డి, తాగునీటి వసతులు లేవన్నారు. బస్సులో చార్జింగ్ పాయింట్‌లు కూడా లేవని వీటన్నింటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి డీఏవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, ఆర్‌టీసీ కార్మికులు, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎరువుల కృత్రిమకొరత సృష్టిస్తే కఠినచర్యలు

- వ్యవసాయశాఖ ఏడీ, తహసీల్దార్ హెచ్చరిక


రేణింగవరంలో గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

పంగులూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధికధరలకు విక్రయించినా, కఠినచర్యలు తీసుకుంటామని ఏడీ.సుదర్శనరాజు, తహసీల్దార్ సింగారావు హెచ్చరించారు. పంగులూరులోని మనగ్రోమోర్, రేణంగివరంలోని జయఆగ్రో ఏజన్సీస్ ఎరువుల దుకాణాలను త్రిసభ్య కమిటీ తనిఖీ చేసింది. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులను, రికార్డులను పరిశీలించారు. రేణంగావరంలో డిటర్జంట్‌బార్ల తయారీ కేంద్రమైన శివవిఘ్నేశ్వర పరిశ్రమలో తనిఖీలు నిర్వహించారు. రైతులకు రాయితీపై అందజేసే యూరియాను డిటర్జెంట్ల తయారీలో వినియోగిస్తున్నారనే విషయంపై ఆరాతీశారు. ఎలాంటి అవకతవకలు లేవని గుర్తించినట్లు తెలిపారు. రైతాంగానికి నిర్ణీత ధరలకు అందించాల్సిన ఎరువుల విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని దుకాణం యజమానులను సూచించారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**కొండమూరు, జనకవరంలో పొలంపిలుస్తోంది**

అంతకు ముందు కొండమూరు, జనకవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందులను తగు మోతాదులోనే వినియోగించాలన్నారు. కౌలురైతులు తగిన గుర్తింపుకార్డులు పొదడంతో పాటు పంటనమోదు చేసుకుని తగిన ప్రయోజనాలు పొందాలని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. 2025-26 సంవత్సరానికి నల్ల,తెల్ల బర్లీపొగాకు నారుమడులుసాగు, పంటసాగు నిషేదించామన్నారు.

## ట్రాన్స్‌జెండర్లపై వివక్ష తగదు


మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్

అద్దంకిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్, లింగ మార్పిడి వ్యక్తులపై వివక్ష తగదని సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ జి.రమేష్ అన్నారు. మంగళవారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, దిశాల ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1097పై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జండర్స్‌కు సంస్థ ఔట్రిచ్ వర్కర్ టి. దుర్గాభవాని తన సొంత నిధులతో నిత్యవసర పంపిణీ చేశారు.

## జలజీవన్ మిషన్ పనులను పరిశీలించిన అధికారులు


పనులను పరిశీలిస్తున్న అధికారులు

యద్దనపూడి,(మార్టూరు) ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాలలో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పనులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి.అనంతరాజు, డీఈ సతీష్‌చంద్రలు పరిశీలించారు. గన్నవరం గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ నుంచి ఇంటింటికి పైపు లైను పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా పూనూరు గ్రామంలో జరుగుతున్న పైపులైను పనులను అధికారులు పరిశీలించారు. అందుకు సంబంధించి పలు సూచనలను ఈఈ అనంతరాజు ఏఈ చైతన్య, ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజా, నల్లపనేని రంగయ్యచౌదరి, బోయపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## పండ్లతోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం


మామిడి మొక్కను పరిశీలిస్తున్న ఏపీడీ

చినగంజాం, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి) : పండ్లతోటలను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని చీరాల క్లస్టర్ ఏపీడీ కోటనాయక్ అన్నారు. మండల పరిధిలోని మున్నంవారిపాలెం, కడవకుదురు, మొటుపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరై సాగు చేస్తున్న మామిడి తోటలను మంగళవారం ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలో మిగిలిన రైతులందరూ పండ్ల తోటలను వెంటనే వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈసీ. సురేష్, టెక్నికల్ అసిస్టెంట్లు మారుతీ సుదర్శన్, జైరావు శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు వడ్లమూడి రామకృష్ణ, నాగార్జున, పున్నాగులరెడ్డి, ఆయా గ్రామాల పండ్ల తోటల రైతులు పాల్గొన్నారు.